'బీజేపీ, మజ్లిస్‌లను చిత్తుగా ఓడిస్తాం'



ప్రచారం చేస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్, జయశంకర్, ధన్‌రాజ్ తదితరులు

అబిడ్స్: బీజేపీ, మజ్లిస్‌లను చిత్తుగా ఓడిస్తామని హైదరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని ఉస్మాన్‌గంజ్, రిసాలాబ్దుల్లా, సిక్‌గల్లీ, జాంబాగ్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించి రికార్డు సృష్టిస్తుందన్నారు. మతం పేరుతో ఓట్లు దండుకునే మజ్లిస్, బీజేపీలను ప్రజలు తీకొడుతున్నారన్నారు. తమ పార్టీ అభివృద్ధి పేరుమీదనే ఓట్లు అడుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం, ప్రగతితోనే విజయం సాధిస్తామన్నారు. పదేళ్లపాటు పాతబస్తీలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. తాను గెలిచి పాతబస్తీలో రికార్డు సృష్టిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, జయశంకర్, పి.నరేందర్ యాదవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా మహావీర్ జయంతి

అబిడ్స్: మహావీర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగవాన్ మహావీర్ విగ్రహానికి టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చంపాలాల్ బండారి, మోతీలాల్ భగత్, గౌతమ్‌నడ్డా, అశోక్, జిత్తు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న జైన్ సమాజ్ ప్రతినిధులు

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో..

గన్‌ఫౌండ్రీ: పంచ సూత్రాలను పాటించడం ద్వారానే మానవుడు మోక్షాన్ని పొందుతాడని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జైన్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో మహావీర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహావీర్ సూచనలు, బోధనలు అనుసరించదగినవి అని తెలిపారు. కరోనా సమయంలో సైతం జైన్ ప్రతినిధులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జైన్ సేవా సంఘ్ అధ్యక్షుడు యోగేష్ సింగి, మైనార్టీ కమిషన్ సభ్యులు ఇమాన్స్ బాప్న, అశోక్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా తదితరులు

'మైనార్టీలు, దళితుల పక్షాన పోరాడేది మజ్లిస్ ఒక్కటే'



మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: మైనార్టీలు, దళితుల పక్షాన పోరాడేది మజ్లిస్ పార్టీ ఒక్కటే అని ఆ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం నానల్‌నగర్ డివిజన్‌లోని సాలార్ బ్రిడ్జి వద్ద జరిగిన మజ్లిస్ ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తన పదేళ్ల పాలనలో దళితులు, మైనార్టీలకు అణగదొక్కుతూ వస్తున్నారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై దౌర్జన్యాలు జరిగిన కూడా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. అదే విధంగా ఈశాన్య రాష్ట్రాలలో సైతం మారణ హోమం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నోరు విప్పలేదని ఆయన అన్నారు. హైదరాబాద్ నగర సంస్కృతిని మరింత విస్తృత పరిచేందుకు తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఈసారి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, కార్పొరేటర్ మహ్మన్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పఠాన్ తదితరులున్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ సభలో శివారెడ్డి, డాక్టర్ అమృతలత, నెల్లుట్ల రమాదేవి

నాంపల్లి: రచయిత్రి వారణాసి నాగలక్ష్మి రచించిన 'కలవరాలూ–కలరవాలూ' కవితా సంపుటి, 'శిశిర సుమాలు' కథా సంపుటి జంట పుస్తకాల ఆవిష్కరణ సభ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. రచయిత్రి నెల్లుట్ల రమాదేవి అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ కవి కె.శివారెడ్డి హాజరై కలవరాలూ–కలరవాలూ కవితా సంపుటిని ఆవిష్కరించారు. అలాగే విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ అమృతలత శిశిర సుమాలు కథా సంపుటిని ఆవిష్కరించారు. ఈ రెండు పుస్తకాలను ఒకేసారి పుట్టిన తోబుట్టువులైన తన కుమారునికి, కుమార్తెకు రచయిత్రి అంకితం ఇచ్చారు. కవయిత్రి కొండపల్లి నీహారిణి పుస్తక సమీక్ష చేశారు. సభా ప్రారంభంలో రచయిత్రి నాగలక్ష్మి రచించిన లలిత గీతాలాపన కార్యక్రమం జరిగింది. కొమాండూరి రామాచారి బృందం లలిత గీతాలను ఆలపించి అందరిని అలరింపజేశారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



జూ పార్కు వద్ద..

చార్మినార్: పాతబస్తీలో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటక స్థలాలుసందర్శకులతో కళకళలాడాయి. తమ కుటుంబ సభ్యులతో కలిసి పాతబస్తీలోని జూ పార్కు, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, నిజాం మ్యూజియం, మక్కా మసీదులను సందర్శించి కాలక్షేపం చేశారు. సెల్ఫీలు దిగి సరదాగా గడిపారు. చిరు వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి. పర్యాటకుల రద్దీ పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి.

కోటలో సందడి..

గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రత్యేకంగా వచ్చారు. ఎండను సైతం లెక్క చేయకుండా పెద్ద ఎత్తున్న పర్యాటకులు కోట టికెట్ కౌంటర్ వద్ద బారులు తీరారు. కోటలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫిరంగుల వద్ద నిలపడి సెల్ఫీలు దిగారు.



గుల్జార్‌హౌజ్ వద్ద..



కోటలో పర్యాటకులు

సేఫ్టీ..ఏదీ?

- రక్షణ చర్యలు లేకుండానే విద్యుత్ మరమ్మతులు
- పట్టించుకోని క్షేత్రస్థాయి అధికారులు
- విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్న కార్మికులు



ఎలాంటి రక్షణ లేకుండా విద్యుత్ మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

చార్మినార్: టీఎస్ఎస్‌పీడీసీఎల్‌లో పని చేస్తున్న విద్యుత్ కార్మికులు (ఆర్టీజన్స్) తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంబంధిత కార్మికులు విస్మరిస్తుండటంతో అప్పుడప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంతేకాకుండా విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి సంబంధిత అధికారులు సైతం సరైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో ఫీల్డ్ వర్క్‌లో ఉన్న విద్యుత్ కార్మికులు సంఘటన స్థలంలోనే ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే పునరుద్ధరించే తొందరలో సేఫ్టీ మేజర్స్‌ను విస్మరిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్, గ్లౌజ్, ఆర్తింగ్ రాడ్, షూస్, బెల్టు వినియోగించాల్సి ఉంటుంది. అయితే చాలా సందర్భాల్లోని అత్యవసర పరిస్థితుల్లో వీటిని వినియోగించడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

కొరవడుతున్న అధికారుల నిఘా..

సాంకేతిక కారణాలతో అప్పుడప్పుడు విద్యుత్ ప్రమాదాలు సంభవించినప్పుడు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. విద్యుత్ మరమ్మతులకు వెళ్లే కార్మికులు సంబంధిత ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని కచ్చితమైన సమాచారం అందజేసినప్పటికీ..విద్యుత్ సరఫరా ఉండటంతో అప్పుడప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కార్మికులు భద్రతా సూత్రాలను పాటించకపోవడంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెబుతున్న సంబంధిత అధికారులు మరమ్మతులు జరిగేటప్పుడు ఆయా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫీడర్ల నుంచి విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపి వేసే చర్యలను తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నాం..

మరమ్మతులకు వెళ్లే కార్మికులను ఎప్పటికప్పుడు భద్రతపై అప్రమత్తం చేస్తున్నాం. అవసరమైన మేరకు విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి తగిన పరికరాలను ముందే అందజేస్తున్నాం. చాలా వరకు విద్యుత్ ప్రమాదాల నుంచి కార్మికులను కాపాడుతున్నాం. ఎక్కడ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం.

– మహ్మద్ ఖాజా అబ్దుల్ రెహమాన్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ

ఆదేశాల జారీకే పరిమితమవుతున్న అధికారులు..

కేవలం ఆదేశాలు జారీ చేయడం వరకే సంబంధిత అధికారులు పరిమితమవుతున్నారని.. క్షేత్ర పరిశీలనకు రాకుండా కార్యాలయాల్లోనే ఉంటూ అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి చేసే విద్యుత్ మరమ్మతుల సందర్భంగా సంబంధిత ఏఈఈ, ఏఈలు తప్పనిసరిగా ఫీల్డ్‌లో ఉండాలని..సమస్య తీవ్రంగా ఉంటే ఏడీఈ, డీఈ స్థాయి అధికారులు సైతం క్షేత్ర పరిశీలనకు రావాల్సి ఉన్నా..పట్టించుకోవడం లేదంటున్నారు.

సత్ఫలితాలివ్వని భద్రతా వారోత్సవాలు..

ప్రతి ఏడాది టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాలను నిర్వహించి తగిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్ మరమ్మతులకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన చర్యలను ఈ వారోత్సవాల సందర్భంగా వివరిస్తున్నప్పటికీ..ఏ ఒక్క కార్మికుడు వాటిని పాటించడం లేదు. దీంతో విద్యుత్ భద్రతా వారోత్సవాలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు.

23న ఇందిరానగర్‌లో వీర హనుమాన్ జయంతి

జియాగూడ: ఇందిరానగర్‌లోని శ్రీ వీర హనుమాన్ ఆలయంలో 23న జయంతి వేడుకలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి శృంగారం నర్సింహాచార్యులు (చిన్నస్వామి) ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున సుప్రభాత సేవా, మంగళ ఘోష, సభానుజ్ఞ, విశ్వక్‌సేనా, ఆరాధన, పుణ్యావచనము, కంకణ ధారణ, అభిషేకం, అలంకారము, ఆరాధన, సహస్రనామార్చన, నివేదన, హారతి, మంత్ర పుష్పాంజలి, తీర్థప్రసాద వితరణ, దర్శనం, 108 తమలపాకులతో ప్రత్యేక పూజలు, హారతి, పల్లకీ సేవా కొనసాగుతాయన్నారు.

కాంగ్రెస్ వార్‌రూమ్ కో ఆర్డినేటర్‌గా గౌరి సతీష్



అబిడ్స్: కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల వార్‌రూమ్ కో ఆర్డినేటర్‌గా టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్‌ను నియమించారు. సికింద్రాబాద్, మెదక్, జహీరాబాద్ జిల్లాల పార్లమెంటు ఎన్నికల వార్‌రూమ్ కో ఆర్డినేటర్‌గా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా గౌరి సతీష్ మాట్లాడుతూ.. మూడు జిల్లాలతో పాటు రాష్ట్ర నలుమూలలా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం వీస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ప్రగతి, అభివృద్ధి, సంక్షేమంతోనే కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుంన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు, నాయకులను సమన్వయ పరుస్తూ వార్‌రూమ్ ద్వారా వారికి పలు సూచనలు చేసి పార్టీ విజయం సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తానన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను చిత్తుగా ఓడిస్తామన్నారు.

ప్రధాని మోదీకి అన్ని వర్గాల మద్దతు



ఎల్ఈడీ ప్రచార రథంతో బీజేపీ నాయకులు

గోల్కొండ: ప్రధాని మోదీకి అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో మద్దతు పలుకుతున్నారని బీజేపీ నానల్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బాలాజీ సూర్యవంశీ అన్నారు. ఎల్ఈడీ ఎన్నికల ప్రచార రథంతో ఆదివారం నానల్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత పదేళ్లల్లో ప్రధాని మోదీ సాధించే విజయాలను ఈ సందర్భంగా ఓటర్లకు వివరించారు.

23న ఉత్తమ పాత్రికేయులకు పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 23న శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది విశిష్ట పురస్కారాలను రవీంద్రభారతిలో ప్రదానం చేయనున్నట్లు సంస్థ కార్యదర్శి ఆమని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, సినీ దర్శకుడు నర్సింగ్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మీడియా సలహాదారులు సర్వసిద్ధి గురునాథ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, కేంద్ర ఉర్దూ భాషాభివృద్ధి మండలి సభ్యులు పి.మెహక్ మూర్తితో పాటు పలువురు పాత్రికేయులకు పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు.

నియామకం



ప్రకాష్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న వరుణ్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అఖిలభారత అంబేడ్కర్ యువజన సంఘం గన్‌ఫౌండ్రీ డివిజన్ అధ్యక్షుడిగా బత్తుల గ్రంధి ప్రకాష్ నియమితులయ్యారు. ఆదివారం సైఫాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మహనీయుల జయంతి ఉత్సవల సమావేశంలో ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ కో ఆర్డినేటర్ వరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నాగరాజ్, ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీసీపీ సాయి చైతన్య

చాంద్రాయణగుట్ట: ఈనెల 23న హనుమాన్ జయంతి ర్యాలీలను ప్రశాంతంగా జరుపుకోవాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌లో దక్షిణ మండలం డీసీపీ సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పార్లమెంట్ ఎన్నికలు కోడ్ ఉన్నందున నిర్వాహకులందరూ నిబంధనలను పాటించాలన్నారు. రాజకీయ పార్టీల జెండాలను ర్యాలీలో వాడరాదని సూచించారు. కుల, మత ప్రాతిపదికన రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం కోడ్ ఉల్లంఘన కిందికి వస్తుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు త్రిమూర్తులు, శ్రీకాంత్, శోభ, పాండు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు బకాయిలు వెంటనే చెల్లించాలి



సంఘం సర్వసభ్య సమావేశం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో అసోసియేషన్ ఫర్ ఆంధ్ర ప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ సంఘం 4వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘంలోని సభ్యులకు రాయితీలు కల్పించిన యశోద ఆసుపత్రి, లూసీ డయాగ్నొస్టిక్ మేనేజింగ్ డైరెక్టర్‌లను సన్మానించారు. అలాగే పెన్షన్‌దారులకు రావాల్సిన బకాయిలు, కరువు భత్యం బకాయిలు చెల్లించాలని ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి కె.నళిని మోహన్‌కుమార్ అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి సభను సమన్వయం చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం



జుబేర్‌బిన్ ఉమార్ అల్‌కోమాన్



మహ్మద్ బిలాల్, మహ్మద్ రహీం

గోల్కొండ: ఆరోగ్యం సరిగా లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. రిసాల బజార్‌కు చెందిన జుబేర్ బిన్ ఉమార్ అల్‌కోమాన్(51) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయితే ఇతను గత కొన్ని నెలలుగా ఇంటి నుంచి ఎక్కడికి వెళ్లకుండ ఇంట్లోనే ఉంటున్నాడు. అయితే గత శనివారం మధ్యాహ్నం జుబేర్‌బిన్ ఉమార్ అల్‌కోమాన్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఆదివారం కూడా ఇంటికి తిరిగి రాలేదు. అతని కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద వాకాబు చేసినా ఆచూకీ తెలియలేదు. దీంతో సదరు వ్యక్తి కుమారుడు ఇబ్రాహింబాన్ జుబేర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మదర్సాకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు..

మదర్సాకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఈ ఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెపల్లికి చెందిన షేక్ సుహానా తన కుమారులు మహ్మద్ బిలాల్(10), మహ్మద్ రహీం(8) ఇద్దరిని సాలేనగర్ కంచెలోని మదర్సా జామియా తాలీమ్ ఖురాన్‌కు పంపుతుంది. 19న వారు మదర్సాకు వచ్చారు. అయితే 20వ తేదీ సాయంత్రం మదర్సాకు చెందిన మౌలానా షేక్ సుహానాకు ఫోన్ చేశాడు. 19న సాయంత్రం మసీదులో నమాజ్ చేసి తనకు చెప్పకుండానే మహ్మద్ బిలాల్, మహ్మద్ రహీం వెళ్లిపోయారని తెలిపాడు. ఆందోళన చెందిన సుహానా శనివారం రాత్రి పిల్లల ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: అభివృద్ధిని కోరుకునే వారే మజ్లిస్ పార్టీకి ఓటు వేస్తున్నారని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ డివిజన్‌లోని చోటాబజార్, బడా బజార్, మోతీదర్వాజా తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి హైదరాబాద్ మజ్లిస్ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని ఆయన కోరారు. కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి అసదుద్దీన్ ఎంతో కృషి చేశారన్నారు. మజ్లిస్ పార్టీ సెక్యూలర్ విధానాలకు కట్టుబడి ఉందని కార్వాన్ నియోజకవర్గంలో ఆలయాలు, శ్మశానవాటికల అభివృద్ధికి తాను కృషి చేశానన్నారు. మజ్లిస్ నాయకులు ఏకే పటాన్, హారూన్‌ఫరాన్, అమీరుద్దీన్ తదితరులున్నారు.

చలివేంద్రం ఏర్పాటు



గోల్కొండ కోట వద్ద జలమండలి వారి చలివేంద్రం

గోల్కొండ: ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రధాన కూడళ్లు, పర్యాటక కేంద్రాల వద్ద తాగునీటిని ఉచితంగా అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని జలమండలి డీజీఎం ఖాజా జవహర్ అలీ అన్నారు. ఆదివారం గోల్కొండ కోట ముందు గల వార్డు కార్యాలయం ఆవరణలో జలమండలి వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోల్కొండ కోటకు ప్రతినిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారన్నారు. వారి సౌకర్యాం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులతో రద్దీగా ఉండే బస్టాప్‌లు, కూడళ్ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

'భగవద్గీత దిక్సూచి లాంటిది'



కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత శోభారాజ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో దారితప్పుతున్న మానవ సమాజ భగవద్గీత దిక్సూచి లాంటిదని పద్మశ్రీ పురస్కార గ్రహీత శోభారాజ్ అన్నారు. ఆదివారం ఎల్బీస్టేడియం ఫతే మైదాన్ క్లబ్‌లో మీహీరా సంస్థ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ భగవద్గీత సోషల్ మీడియా వేదికను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..భగవద్గీతను ఎర్ర వస్త్రంలో చుట్టి పూజలు చేయడం కాదు.. దానిని ఆచరించి అవగాహన చేసుకుంటే జీవితం సార్థకత అవుతుందన్నారు. అనంతరం గీతా శ్లోకాలు, వాటి అర్థాలతో కూడిన వీడియోలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తనుజ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



బుల్లితెర నటి మాధవీరెడ్డిని సన్మానిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారత ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్, జై జవాన్, జై కిసాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్ ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. దేశానికి సేనికుడు, రైతు రెండు కళ్లలాంటి వారని తెలిపారు. అనంతరం వివిధ రంగాలలో రాణిస్తున్న పలువురిని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త వల్లూరి విజయ్ కుమార్, చకిలం అసోసియేట్ అధినేత సీహెచ్. సుధాకర్, బుల్లితెర నటులు మాధవీరెడ్డి, ఊర్వశి పటేల్, కిరణ్ ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లయన్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి విగ్రహం బయటపడిన ఘటనలో నలుగురి అరెస్టు

సుల్తాన్‌బజార్: ఇటీవల శ్రీకృష్ణుడి విగ్రహం బయటపడిన ఘటనలో నలుగురు నిందితులను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస చారి తెలిపిన వివరాల ప్రకారం..రామ్‌కోఠిలోని మూసి ఉన్న అమృత్ కపాడియా నవజీవన్ కళాశాలలో ఉద్యేశపూర్వకంగా రామ్‌కోఠికి చెందిన కావేరి సత్యనారాయణ(70), రాజమౌళ్లకు చెందిన పి.గంగారామ్ (27), ఎర్రోళ్ల సాయిలు (40), గువ్వ సాయిలు (40) వీరు ఉద్దేశపూర్వకంగా గత కొన్నేళ్లుగా మూసి ఉన్న కళాశాలలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని గేటు తాళాలు పగలగొట్టి అక్రమంగా కళాశాలలోకి చొరబడి మూడు ఫీట్ల గోతిని తవ్వి శ్రీనికృష్ణుడి విగ్రహాన్ని పాతి శ్రీకృష్ణుడు వెలిశాడనే పుకార్లు చేశారని పోలీసులు తెలిపారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించగా ఈ నలుగురు వ్యక్తులు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు విగ్రహం వెలిసిందని డ్రామాలు చేశారు. సీసీ ఫుటేజీల, ప్రత్యేక్ష సాక్షులను విచారించడంతో నిందితుల ఆచూకీ తెలిసింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తామే విగ్రహాన్ని పాతి పెట్టామని ఒప్పుకున్నారు. కళాశాలకు చెందిన సుశీల్ కపాడియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జూ పార్కులో వరల్డ్ ఎర్త్ డే



కుండ తయారీలో జూ పార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఈరేమంత్

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులో వరల్డ్ ఎర్త్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు సహజసిద్ధంగా మట్టి కుండలపై పెంటయ్య శిక్షణను ఇచ్చారు. వైల్డ్ లైఫ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని జూ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఈరేమంత్, డిప్యూటీ క్యూరేటర్ నాగమణి, పీఆర్ఓ అనీఫ్‌ఉల్లాలతో పాటు జూవాలజిస్టులు లక్ష్మీనారాయణ, బాబురావు, దీపక్ తరుణ్, దేవన్యలతో పాటు న్యూ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.